ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 తమిళనాడు TAMILNADU

శుక్రవారం 6 డిసెంబరు 2024

ఆన్‌లైన్ చీటింగ్..

డిజిటల్ అరెస్ట్



ఇబ్బడిముబ్బడిగా బెదిరింపులు ● అడ్డూ అదుపూ లేని మోసాలు ● రాష్ట్రంలో రూ.500కోట్ల స్వాహా !

టి.నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్ట్..!' ఇటీవలి కాలంలో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్న పదం ఇదే! 'హలో..! మీ పేరుతో మాదకద్రవ్యాలతో ఓ పార్శిల్ పట్టుకున్నాం. ఆ కేసులో మిమ్మల్ని విచారించడానికి ముంబై క్రైం బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నాం. మాదక ద్రవ్యాల కేసులో మీరిప్పుడు డిజిటల్ పద్ధతిలో అరెస్టయ్యారు. మీరు ఇంటి నుంచి కదలడానికి వీల్లేదు' అంటూ సరళమైన ఆంగ్లంలో మాట్లాడే వ్యక్తి తనను పోలీసు ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని మాటలు కొనసాగిస్తాడు. ఆ మాటలను నమ్మి పలువురు ఆ అరెస్టు గండం నుండి ఎలా బయటపడాలో తెలియక విలవిల్లాడుతూ క్షణాల్లో తమ బ్యాంక్ ఖాతాలో ఉన్న కోట్లాది రూపాయలను నష్టపోతున్నారు. 'డిజిటల్ అరెస్టు నుంచి మిమ్మల్ని రిలీజ్ చేయాలంటే మేం చెబుతున్న బ్యాంక్ ఖాతాలోకి అడిగినంత సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడి ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడే ముఠా ఈ కొత్తరకం నిలువు దోపిడీలకు పాల్పడుతోంది. కొన్నేళ్లకు ముందే ఇలాంటి మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవలి కాలంలోనే అడ్డూ అదుపూ లేకుండా ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే ముఠాల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇదే రీతిలో పెట్టుబడులకు సంబంధించిన యాప్‌ల ద్వారా కూడా డబ్బు గుంజుతున్న ఘటనలు కూడా కోకొల్లలుగా పెరుగుతున్నాయి. ఓ యాప్ ద్వారా పరిచయం చేసుకునే ఈ ముఠా సభ్యులు తాము తెలిపే బ్యాంక్ ఖాతాలో పొదుపు చేసే మొత్తానికి రెట్టింపు సొమ్ము ఒకటి రెండు రోజుల్లోపునే జమచేస్తామని చెబుతారు. ఆ మాటలను నమ్మి తొలుత ఎవరైనా ఐదారు వేలు డిపాజిట్ చేస్తే ఆ యాప్ వ్యక్తులు మరుసటి రోజే దానికి రెట్టింపు సొమ్ము వారి బ్యాంక్ ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. దీంతో ఎలాంటి శ్రమలేకుండా సులువుగా డబ్బు సంపాదించుకోవచ్చనే ఆశ అధికమవుతుంది. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా మాట్లాడే వ్యక్తులు తమను తాము బడా పారిశ్రామికవేత్తలుగా ప్రకటించుకుంటారు. తమ వద్ద నల్లధనాన్ని ఐటీ, ఈడీ దాడులకు పాల్పడి ఈ క్యాష్ డబ్లింగ్ చేసి ప్రజలను కోట్లకు పడగెత్తేలా చేయడమే తమ ఆశయమంటూ ఏవేవో మాటలు చెబుతున్నారు. వారి మాటలను విన్నవారికి ఆ యాప్‌లో ఎన్ని లక్షలైనా పెట్టుబడి పెట్టి రెట్టింపు సొమ్ము పొందగలమనే నమ్మకం ఏర్పడుతుంది. వేలల్లో చేసిన డిపాజిట్ ఒక్కసారిగా లక్షలకు పెంచేస్తారు. తమ బ్యాంక్ ఖాతాల నుంచి లక్షలాది రూపాయలను ఆ మోసాల ముఠా యాప్ బ్యాంక్ ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసి రెట్టింపు సొమ్ము ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తారు. రెండు మూడు రోజుల్లో రెట్టింపు సొమ్ము తమ బ్యాంక్ ఖాతాల్లో పడుతుందని ఆశగా వేచి ఉంటారు. చివరకు రోజులు, నెలలు గడిచినా తమ ఖాతాల్లోకి చిల్లిగవ్వకూడా జమకాదు. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని లబోదిబోమంటారు. ఇలాంటి మోసాలకు పాల్పడే ముఠాలను సులువుగా కనుగొనటం అసాధ్యం కనుక రోజురోజుకూ ఈ ఆన్‌లైన్ క్యాష్ డబ్లింగ్ మోసాలు అధికమవుతూనే ఉన్నాయి.

చెన్నైలోనే 1600లకు పైగా కేసులు...

రాజధాని నగరం చెన్నైలో ఈ యేడాది సెప్టెంబర్ వరకూ ఈ క్యాష్ డబ్లింగ్ ముఠా యాప్ ద్వారా మోసపోయిన 1600 మందికిపైగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుల్లో వివరాల ప్రకారం రూ.190 కోట్ల మేర ఆ ముఠా స్వాహా చేసినట్లు తెలుస్తోంది. అయితే ఊహించని విధంగా తదుపరి రెండు మాసాల్లో అంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో బాధితుల సంఖ్య 2 వేలకు పెరిగింది. సుమారు రూ.200 కోట్ల వరకు యాప్ ముఠా మోసగించినట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ యేడాది ఇప్పటివరకూ సుమారు 600 మంది ఈ క్యాష్ డబ్లింగ్ మోసాల బారిన పడి కోట్లాది రూపాయలను నష్టపోయారని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. తాంబరం, పరిసర ప్రాంతాల్లోనూ వందలాదిమంది ఈ ఆన్‌లైన్ మోసాలకు గురై ఉన్నదంతా ఊడ్చుకుపోయి తిండికి కూడా డబ్బులు లేక అలమటిస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల బ్యాంకుల్లో...

ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేవారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారని సైబర్ క్రైం పోలీసులు విచారణలో వెల్లడైంది. ఉత్తరాది రాష్ట్రాల నుండే ఈ ముఠా సభ్యులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కష్టపడి సంపాదించి బ్యాంకుల్లో పొదుపు చేసిన సొమ్మును ఈ ముఠా సభ్యులు సులువుగా తమ ఖాతాల్లోకి మార్చుకుని దర్జాగా తిరుగుతున్నారు. ఈ మోసాలను నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం దినపత్రికల్లో ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రకటనలు ఇస్తోంది. ఇలాంటి నేరాలను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసులకు సునిశిత శిక్షణ కూడా ఇస్తున్నారు. పాఠశాలలు, కళాశాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను కూడా విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇంత చేసినా ఆన్‌లైన్ మోసాలను అదుపు చేయలేకున్నారు.

చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఈ మోసాలు అడ్డూ అదుపూ లేకుండా జరుగుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి లక్షలాది రూపాయలను నష్టపోయేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రతనెలా రాష్ట్రమంతా సుమారు 500 మంది వరకు ఆన్‌లైన్ ముఠా వలల్లో చిక్కుతున్నారని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాజధాని నగరం చెన్నైలో గడిచిన 11 నెలల్లో సగటున ప్రతినెలా 200 మంది వరకు ఈ ఆన్‌లైన్ మోసాల ద్వారా లక్షలాది రూపాయలను నష్టపోయినట్లు స్పష్టమవుతోంది. ఇదేవిధంగా కోయంబత్తూరు, సేలం, కన్నియాకుమారి, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి తదితర నగరాల్లో నివసించే ధనవంతులను టార్గెట్‌గా చేసుకుని ఆన్‌లైన్ మోసాలు కొనసాగుతున్నాయి. కోవై జిల్లాలో 2023లో 6396 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ యేడాది ఆ కేసుల సంఖ్య అధికమైంది. గత పది నెలల్లోనే ఆ జిల్లాలో 6738 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.93.04 కోట్ల మేరకు యాప్ ముఠా మోసగించినట్లు కనుగొన్నారు. సైబర్ క్రైం పోలీసులు చర్యల కారణంగా బాధితులకు రూ.10.14 కోట్లు లభించింది. ఇలా రాష్ట్రమంతటా ఈ ఆన్‌లైన్ మోసాల ముఠా గత 11 నెలల్లో రూ.500 కోట్ల మేర మోసగించినట్లు పోలీసుల రికార్డులు తెలియజేస్తున్నాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. అయినా ఈ మోసాలను పూర్తిగా నిరోధించలేకపోతున్నారు. ఆన్‌లైన్ మోసాలను నిరోధించడానికి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, మహానగర స్థాయిలో పనిచేస్తున్న సైబర్ క్రైం పోలీసులు వేర్వేరుగా పలు కేసులను నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

డిజిటల్ అరెస్టే లేదు

ఇలాంటి మోసాలకు గురికాకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సైబర్ క్రైం విభాగం ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ... 'ఆన్‌లైన్ ద్వారా ఎవరినీ డిజిటల్ అరెస్టుచేయడానికి వీల్లేదనే విషయాన్ని అందరూ గుర్తించాలి. ఏ రాష్ట్రానికి చెందిన, ఎంతటి ఉన్నతస్థాయి పోలీసు అధికారి అయినా ఎవరినీ డిజిటల్ అరెస్టు చేయడానికి వీల్లేదని గమనించాలి. ఎవరైనా ఫోన్ చేసి 'మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేశాం' అని చెబితే ఆ వ్యక్తి ఆన్‌లైన్ మోసానికి పాల్పడే ముఠా సభ్యుడని గ్రహించాలి. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి' అని సూచించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి తటపటాయిస్తుంటే ఆ ఆన్‌లైన్ ముఠా మాయమాటలతో బోల్తా కొట్టించి డబ్బుల్ని సులువుగా తమ బ్యాంక్ ఖాతాల్లోకి మార్చేసుకుంటుందని చెప్పారు. ఇక ఈ ముఠా బారిన పడి మోసపోయినవారి ధనాన్ని తిరిగి రాబట్టడంలో పలు చిక్కులు ఎదురవుతున్నాయని తెలిపారు. బాధితుల బ్యాంక్ ఖాతాల నుంచి ఏ బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయనే విషయాన్ని సులువుగా కనుగొనేందుకు వీలున్నప్పటికీ ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాలకు సంబంధించిన బ్యాంకులు ఏ మాత్రం సహకరించడం లేదని వాపోయారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన నగదు ఏ సమయంలో ఏ బాధితుడి ఖాతా నుండి ట్రాన్స్‌ఫర్ అయ్యిందో వివరించి ఆ నగదును బాధితుడి బ్యాంక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయమని సైబర్ క్రైం పోలీసులు ప్రతిపాదనలు మాత్రమే చేయగలరని, ఆ ప్రతిపాదనలను ఉత్తరాది రాష్ట్రాల బ్యాంకులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

కలుషిత నీటికి

ముగ్గురి బలి

- 30మందికి అస్వస్థత
- మలైమేడు ప్రాంతంలో వైద్య శిబిరం : మంత్రి దామో అన్బరసన్
- పల్లావరం ఘటనపై విపక్షాల ఆగ్రహం



పల్లావరంలో ఏర్పాటైన వైద్యశిబిరం, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు





మృతులు(ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లావరం వద్ద కలుషిత మంచినీటిని తాగి ముగ్గురు దుర్మరణం చెందగా, 30 మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాంబరం కార్పొరేషన్ 13వ వార్డు కామరాజ్‌నగర్ కంటోన్మెంట్ పల్లావరం మలైమేడు ప్రాంతంలో బుధవారం సాయంత్రం సుమారు 35 మంది ఉన్నట్టుండి వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 20 మందిని క్రోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్స ఫలించక ముగ్గురు మృతిచెందారు. ఆ ప్రాంతంలో తాగునీటిలో మురుగునీరు కలిసి కలుషితం కావడం వల్లే 30 మందికిపైగా వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో త్రివేది (57) అనే వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. చికిత్స చేయించుకుని ఇంటికి చేరిన మోహనరంగన్ గురువారం ఉదయం మృతి చెందాడు. అలాగే ఆస్పత్రిలో చికిత్స ఫలించక వరలక్ష్మి అనే మహిళ కూడా ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఈ సంఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న మంత్రి దామో అన్బరసన్ హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ముగ్గురి మృతికి కలుషితనీరే కారణమని స్థానికులు చెబుతున్నారని, బుధవారం రాత్రి తిన్న ఆహారం వికటించి కూడా అస్వస్థతకు గురై ఉండవచ్చన్నారు. ఏది ఏమైనా నీటి నమూనాలను ప్రయోగశాలకు పంపామని, వాటి ఫలితాలు వచ్చాకే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ఈ సందర్భంగా మలైమేడు ప్రాంతంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు వైద్యపరీక్షలు జరిపి మందులు కూడా పంపిణీ చేయిస్తున్నామని చెప్పారు. ఇదే విధంగా ఈ సంఘటనకు కలుషిత నీరు కారణం కాదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, కార్పొరేషన్ అధికారులు కూడా చెబుతున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్ అధికారులు మలైమేడు ప్రాంతంలో నీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపారు. ముగ్గురి మృతదేహాలకు సంబంధించి పోస్టుమార్టం నివేదిక వెల్లడైన తర్వాతే వారి మృతికి కారణాలు వెల్లడవుతాయని తాంబరం కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

ఈపీఎస్ దిగ్భ్రాంతి..

పల్లావరంలో కలుషిత నీటిని తాగి ముగ్గురు మృతి చెందటం పట్ల అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పల్లావరం ప్రాంతాల్లో వర్షపునీటిలో మురుగునీరు కూడా కలిసిపోయిందని, దీనిపై కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో కలుషిత నీరు తాగి ముగ్గురు మృతి చెంది, పలువురు అస్వస్థతకు గుయ్యారని తెలిపారు. ఇదే రీతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా మంత్రి దామో అన్బరసన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పల్లావరంలో ముగ్గురి మృతికి కలుషిత నీరు కారణం కాదని, తిన్న ఆహారం వికటించి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేయడం గర్హనీయమన్నారు. పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి కూడా వేర్వేరు ప్రకటనలలో ఈ సంఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. పల్లావరంలోని వర్షబాధిత ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టకపోవడం వల్లే కలుషిత నీరు తాగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.

దివ్యాంగుల కోసం

విళుదుగళ్ సేవా వాహనం

- జెండా ఊపి ప్రారంభించిన సీఎం స్టాలిన్
- సేవాపరులకు అవార్డుల ప్రదానం
- రూ.130 కోట్లతో త్రిచక్రవాహనాల పంపిణీ





సచివాలయం వద్ద 'విళుదుగళ్' సేవా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చెన్నై సచివాలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో దివ్యాంగులకు విశిష్టమైన సేవలందించే 'విళుదుగళ్' పునరావాస సేవా వాహనాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గురువారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో సేవాపరులైన దివ్యాంగులకు అవార్డులను కూడా ప్రదానం చేశారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పథకం స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా రాష్ట్రమంతటా త్రిచక్ర వాహనాల (స్కూటీల) కోసం దరఖాస్తు చేసుకున్న 26 వేలమందికి రూ.130 కోట్లతో కొనుగోలు చేసిన స్కూటీల పంపిణీ కూడా ప్రారంభించిన సీఎం సచివాలయంలో పదిమంది దివ్యాంగులకు స్కూటీలను అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ సచివాలయానికి, ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లలేని దివ్యాంగులకు సేవలందించడానికే ఈ 'విళుదుగళ్' సేవా వాహన సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఈ వాహనంలోని అధికారులు అన్ని ప్రాంతాలకు వెళ్ళి దివ్యాంగుల నుంచి వినతి పత్రాలను, సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని, దీంతో వారి సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతారని ఆయన వివరించారు. అంతే కాకుండా ఈ వాహనంలో స్పీచ్ థెరఫీ, వినిడి పెంపు చికిత్స, ప్రత్యేక విద్యాబోధన కూడా లభిస్తాయన్నారు. అదే విధంగా సేవాపరులైన 16 మంది దివ్యాంగులకు అవార్డులను కూడా ప్రదానం చేశారు.ఈకార్యక్రమాల్లో మంత్రులు గీతా జీవన్, ఎం.సుబ్రమణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సీజీ థామస్‌వైద్యన్, రాష్ట్ర కమిషనర్ ఆర్.సదన్, డైరెక్టర్ ఎం.లక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు బియ్యం ...

తుఫాన్‌బాధితుల కోసం డీఎంకే తరఫున 250 టన్నుల బియ్యం బస్తాల లోడుతో అన్నా అరివాలయం నుంచి లారీలు గురువారం ఉదయం బయలుదేరాయి. డీఎంకే కాంచీపురం నార్త్ జిల్లా శాఖ తరఫున మంత్రి దామో అన్బరసన్ అందించిన వంద టన్నుల బియ్యం బస్తాలు, చెన్నై సౌత్ జిల్లా శాఖ తరఫున మంత్రి ఎం.సుబ్రమణ్యం సమకూర్చిన 150 టన్నుల బియ్యం బస్తాల లోడుతో ఉన్న ఆ లారీలకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ జెండా ఊపి సాగనంపారు.

తుఫాను బాధితులకు స్టాలిన్ విరాళం...

ఫెంగల్ తుపాను బాధితుల కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ తన నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఆ మేరకు విరాళాన్ని చెక్కురూపంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందంకు అందజేసి సీఎం సహాయ నిధి ఖాతాలో జమ చేయమని ఆదేశించారు. ఇదే విధంగా డీఎంకే ప్రధాన కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్, తురైముగం ఖాజా తమ నెల వేతనాన్ని తుపాను బాధితులకు విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు.







జయలలిత సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వీకే శశికళ - టీటీవీ దినకరన్ - అన్నాడీఎంకే నేతలతో పుష్పాంజలి ఘటిస్తున్న కలిసి ఎడప్పాడి పళనిస్వామి

రాష్ట్రంలో మళ్లీ

అన్నాడీఎంకే పాలన

ఈపీఎస్ శపథం ● జయకు ఘన నివాళి

ప్యారీస్, డిసెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆదరణతో మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సమాధి వద్ద శపథం చేశారు. జయలలిత ఎనిమిదో వర్ధంతిని పురస్కరించుకుని మెరీనా బీచ్‌లోని ఆమె సమాధి వద్ద గురువారం ఎడపాడి పళనిస్వామి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు అన్నాడీఎంకే ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్ మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు కేపీ మునుస్వామి, డి.జయకుమార్, వలర్మతి, గోకుల ఇందిర, ఆర్బీ ఉదయ్‌కుమార్, వైగై సెల్వన్, నత్తం విశ్వనాథన్, సెమ్మలై, కడంబూర్ రాజు, బీవీ రమణ, సెల్లూర్ రాజు, ఎంసీ సంపత్, మాధవరం మూర్తి, సెంగోట్టయ్యన్, మాఫాయ్ పాండ్యరాజన్, డా. తంబి దురై, జిల్లా కార్యదర్శులు బాల గంగా, ఆర్ఎస్ రాజేష్, ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్, వెట్రివేల్ మారిముత్తు తదితర నేతలు కూడా జయకు నివాళులర్పించారు. అనంతరం సమాధి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకున్న ఎడప్పాడి పళనిస్వామి పార్టీ నేతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ... భారత రాజకీయ చరిత్రలో పేదల మనసు దోచుకుని, ప్రజా శక్తిగా దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత రాణించారని కొనియాడారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి సుమారు 2 కోట్లమందికి పైగా సభ్యులతో పార్టీని ముందుకు నడిపించిన మహానేత అని, సినీ, రాజకీయ రంగాలలో చక్రం తిప్పి చరిత్రలో నిలిచిపోయారని కీర్తించారు. ప్రజా వ్యతిరేక డీఎంకేలో తాగు నీటి పన్ను, డ్రైనేజీ పన్ను, ఆస్తి పన్ను, రిజిస్ట్రేషన్ పన్నులు విపరీతంగా పెంచారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పట్టించుకోని డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే తమ లక్ష్యమని సభాముఖంగా శపథం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయ పాలనలో రాష్ట్రం సుభీక్షంగా ఉండి అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా గడిపారని మళ్లీ అలాంటి పాలనను తీసుకొచ్చేందుకు సైనికుల్లా పార్టీ కార్యకర్తలు పాటుపడాలని, ఈపీఎస్ పిలుపునిచ్చారు.

శశికళ, ఓపీఎస్‌ల నివాళి..

దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు వీకే శశికళ, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ సహా వారి మద్దతు దారులు జయలలిత సమాధిపై పుష్ప గుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. అలాగే ఓపీఎస్ వర్గానికి చెందిన మాజీ మంత్రులు వైద్య లింగం, వెల్లమండి నటరాజన్, ఎమ్మెల్యే మనోజ్ పాండియన్ తదితరులు అంజలి ఘటించారు.



నివాళులర్పించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు

సమాచార దృష్టి

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడలు, పనితీరు అభివృద్ధి నిర్వహణ ట్రస్ట్, కాంచీపురం సహనా యోగా సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు శనివారం కాంచీపురం తిరుక్కాలిమేడు ప్రభుత్వ పాఠశాలలో జరుగనున్నాయి. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, యోగా కేంద్రాల విద్యార్థులు ఇతరులు 6 నుంచి 56 ఏళ్లున్న వారికి పది విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు, విజేతలకు ట్రోఫీలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9092334820 అనే నెంబరు శుక్రవారం సాయంత్రంలోగా సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

'జ్యువెలరీ ఇండస్ట్రియల్ పార్క్'కు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ కురిచ్చి సిడ్కో ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.126 కోట్లతో బంగారు ఆభరణాల పార్కు ప్రాజెక్ట్ సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. నవంబరులో కోవైలో పర్యటించిన ముఖ్యమంత్రి స్టాలిన్, కోవైలో జ్యువెలరీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ పార్క్ పర్యవేక్షణను తమిళనాడు చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ చేపట్టనున్న నేపథ్యంలో, తాజాగా, పార్క్ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది.

పెరిగిన ప్రైవేటు పాల ధరలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థలు పెంచిన పాల ధరలు గురువారం నుంచి అమలుకు వచ్చాయి. రాష్ట్రంలో నాలుగు ప్రైవేటు సంస్థలు పాలు, పాల ఉత్పత్తులు విక్రయిస్తున్నాయి. రాష్ట్ర పాల విక్రయాల్లో ఈ సంస్థలు 45 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ప్రైవేటు సంస్థలు పాలు లీటరు రూ.2 నుంచి రూ.4 వరకు, పెరుగు, మజ్జిగ ధరలు రూ.4 నుంచి రూ.6 వరకు పెంచగా, పెంచిన ధరలు గురువారం నుంచి అమలుకు వచ్చాయి.

నేటినుంచి వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిలంబాక్కం, కోయంబేడు, మాధవరం నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 155 అదనపు బస్సులు, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక, శనివారాల్లో తలా 40 అదనపు బస్సులు నడుపనున్నారు. అలాగే, మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 15 అదనపు బస్సులు నడుపనున్నారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి నగరానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ప్రయాణికులు ముందుగా రిజర్వేషన్ చేసుకుని ప్రయాణం చేయాలని ఎస్ఈటీసీ విజ్ఞప్తి చేసింది.

హొగెనేకల్‌లో దోనె సవారీకి అనుమతి

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్ జలపాతంలో దోనెల సవారీకి అనుమతించారు. కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా హొగెనేకల్ జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా మంగళవారం నుంచి ఈ జలపాతాల్లో దోనెల సవారీని రద్దు చేశారు. గురువారం ఉదయం నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జిల్లా యంత్రాంగా దోనెల సవారీకి అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్, పెరంబూర్, ఆవడి మండలాల్లో విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరాలు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి జరుగనున్నాయి. ఎగ్మూర్ పరిధిలో ఓట్టేరిలోని 110 కేవీ. సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, ఆవడి పరిధిలో మురుగప్ప పాలిటెక్నిక్ సమీపంలోని 230 కేవి సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, పెరంబూర్ పరిధిలో సింప్సన్ సమీపంలోని 110 కే.వి సబ్‌స్టేషన్ ప్రాంగణలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో జరుగనున్న ఈ శిబిరంలో వినియోగదారులు పాల్గొని, కొత్త కనెక్షన్లు, మీటర్ల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, బకాయిలు, విద్యుత్ కోతలు తదితరాలు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

'ఇస్రో' ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ'పై ఉచిత శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కళాశాల విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై రెండు వారాల పాటు శిక్షణ ఇవ్వనుంది. ఇస్రో నిర్వహిస్తున్న ఈ సర్టిఫికెట్ కోర్సు తరగతులు ఈ నెల 9 నుంచి 20వ తేది వరకు జరుగనున్నాయి. ఈ శిక్షణలో దేశవ్యాప్తంగా యూజీ మొదటి సంవత్సరం, పీజీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. ఆన్‌లైన్‌లో సమాచారం భద్రపరచడం, వాటిల్లో జరుగుతున్న మోసాలు, నగదు బదిలీల్లో అవకతవకలు, వాటి నుంచి రక్షణ తదితరాలను బోధన, ప్రాక్టికల్స్‌లో అందించనున్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తారు. మరిన్ని వివరాలకు https://elearning. iirs.gov.in/ edusatregistration/ coordinator/ అనే వెబ్‌సైట్, దరఖాస్తు సమర్పణకు http-s://elea-rning.iirs. gov.in/edusatregistration/అనే వెబ్‌సైట్, 0135-2524130అనే నెంబరు సంప్రదించవచ్చు.

అయ్యా బాబోయ్ దిండివనంలో బస్‌స్టేషనా!?

అయితే పదవీ గండం తప్పదా? ● రాజకీయ నేతల గుండెల్లో గుబులు


దిండివనం చెరువు స్థలంలో నిర్మాణంలో ఉన్న బస్‌స్టేషన్


మాజీ మంత్రి సీపీ షణ్ముగం


మాజీ మంత్రి సెంజి మస్తాన్

టి.నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతంలోనైనా కొత్తగా బస్‌స్టేషన్ నిర్మిస్తారంటే ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని అందరూ అనుకుంటారు. అయితే దిండివనం రాజకీయ నాయకులు మాత్రం 'అయ్యా బాబోయ్! బస్‌స్టేషనా? ఆ మాటెత్తితే మా పదవులకు గండమే' అంటూ భయంతో వణికిపోతున్నారు. ఈ భయం సెంటిమెంట్ కారణంగానే దిండివనంలో కొత్త బస్‌స్టేషన్ నిర్మాణ పథకం 32 యేళ్లుగా నత్తనడక కొనసాగుతోంది. 'దిండివనం ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయాలంటే బస్‌స్టేషన్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది, త్వరలో ఆ బస్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుంది' అంటూ 1991లో అప్పటి సౌత్ ఆర్కాడు జిల్లా కలెక్టర్ గరియాలి ప్రకటించారు. ఆ ప్రకటన చేసిన ఆ ఐఏఎస్ అధికారి బదిలీ అయ్యారు. దాంతో బస్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్రకటన ఆగిపోయింది. ఆ తర్వాత బస్‌స్టేషన్ కావాలంటూ దిండివనం నాయకులు గానీ, స్థానికులు గానీ నోరుమెదపలేదు. 2001లో దిండివనం నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సీవీ షణ్ముగం వక్ఫ్‌బోర్డు స్థలంలో కొత్త బస్‌స్టేషన్‌ను నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటి అన్నాడీఎంకే మునిసిపాలిటీ అధ్యక్షుడు హీరాచంద్ ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఆ తర్వాత 2005లో, రూ.6లక్షల అడ్వాన్స్, 60 వేల అద్దె చెల్లింపు అనే ఒప్పందం ప్రకారం వక్ఫ్‌బోర్డుకు చెందిన స్థలంలో బస్‌స్టేషన్ నిర్మించడానికి మున్సిపాలిటీ అంగీకరించింది. ఆ తర్వాత ఆ యేడాదే డిసెంబర్ 30న అక్కడ తాత్కాలిక బస్‌స్టేషన్ ప్రారంభించారు. అయితే 33 రోజులు మాత్రమే నడిచిన ఆ తాత్కాలిక బస్ స్టేషన్ ఏవో కారణాల వల్ల మూతపడింది. ఆ తరువాత 2009లో దిండివనం చెరువు ప్రాంతంలో కొత్త బస్‌స్టేషన్‌ను యేడాదిలోగా నిర్మించనున్నట్లు మున్సిపల్ అధికారులు ప్రకటించారు. అయితే ఆ ప్రకారం బస్‌స్టేషన్ నిర్మాణం జరగలేదు. దీంతో 2011 శాసన సభలో అప్పటి దిండివనం ఎమ్మెల్యే హరిదాస్ 'దిండివనంలో వీలైనంత త్వరగా బస్‌స్టేషన్ నిర్మించాలి' అంటూ ప్రతిపాదించారు. ఆ తర్వాత ఆయన రాజకీయ జీవితం పరిసమాప్తమైంది. ఇలా బస్‌స్టేషన్ పేరెత్తితేనే జరగకూడనివి జరుగుతున్నాయనే సెంటిమెంట్ రాజకీయ నాయకుల గుండెల్లో గుబులు పుట్టించింది. అప్పట్లో పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ అన్నాడీఎంకే పాలకులు దిండివనం బస్‌స్టేషన్ గురించి పల్లెత్తు మాట అనకుండా మౌనం పాటించారు. ఈ పరిస్థితుల్లో గత యేడాది ఆరెకరాల్లో రూ.20 కోట్లతో కొత్త బస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు అప్పటి మంత్రి సెంజి మస్తాన్ ప్రకటించారు. బస్‌స్టేషన్ నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన కూడా చేశారు. అంతే! సెంజి మస్తాన్ అటు పార్టీ పదవిని, ఇటు మంత్రి పదవిని ఒకేసారి కోల్పోయారు. ప్రస్తుతం ఆ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు 80 శాతం దాకా పూర్తయ్యాయి. ఆ పనులు పూర్తయితే ముఖ్యమంత్రి స్టాలిన్ దిండవనానికి వెళ్ళి లేదా సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కొత్త బస్‌స్టేషన్ ప్రారంభిస్తారని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై విల్లుపురం నార్త్ జిల్లా డీఎంకే కార్యదర్శి డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ బస్‌స్టేషన్ నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాక దాని ప్రారంభోత్సవంపై సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారని బదులిచ్చారు. ఇక దిండివనం అన్నాడీఎంకే ఎమ్మెల్యే అర్జునన్‌ను సంప్రదించగా.. ఆయన మాట్లాడేందుకు కూడా భయపడ్డారు. బీజేపీ యువజన విభాగం దినేష్‌కుమార్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు దిండివనం బస్‌స్టేషన్ అనే మాటెత్తితేనే జరుగకూడనివి జరుగుతాయనే భయం సెంటిమెంట్ కలెక్టర్ గరియాలి కాలం నుండే కొనసాగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా కొత్త బస్‌స్టేషన్‌ను చెరువు స్థలంలో నిర్మించి డీఎంకే ప్రభుత్వం నీటివనరులకు అడ్డుకట్ట వేసిదంటూ పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ధ్వజమెత్తారు. ఇక దిండివనం ప్రజలేమో 'ఇవన్నీ మూఢ నమ్మకాల వల్లే తమ ప్రాంతం అభివృద్ధిచెందటం లేదని, 32 యేళ్లకు పైగా కొత్త బస్‌స్టేషన్ వివాదం కొనసాగిందని, ప్రస్తుతం బస్‌స్టేషన్ చివరి దశ పనులను శీఘ్రంగా పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుండే బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఈ కొత్త బస్‌స్టేషన్ ప్రారంభించే లోగా మరెన్ని కట్టుకథలు, భయం సెంటిమెంట్లు పుట్టుకువస్తాయో అనే ఆందోళన దిండివనం ప్రజలలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

తిరువణ్ణామలైకు గొడుగుల వితరణ


గొడుగులు ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక బ్రహ్మోత్సవాలకు శివ జనశక్తి తరపున గొడుగులు సమర్పించారు. ఈ గొడుగులను కలాసపాళ్యం వలయర్‌కార వీధిలో ఉన్న రుక్మాయి సమేత పాండు రంగనాథస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా తిరువణ్ణామలై తీసుకెళ్లారు. కార్యక్రమంలో శివజనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర సెక్రటరీ రవికుమార్, గౌరవాధ్యక్షుడు బాబు, జిల్లా అధ్యక్షుడు లోకనాధన్ పాల్గొని, గొడుగులకు ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాల స్థాయి పెంచాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం పిచ్చానూరు పేటలో ఉన్న గంగాధర స్వామి మున్సిపాలిటీ మాధ్యమిక పాఠశాల స్థాయి పెంచాలంటూ గ్రామస్తులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేపట్టారు. ఈ విషయమై గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, తహసీల్దార్ మెర్లిన్ జ్యోతిక వద్ద పుదియ నీతి పార్టీ నగర సెక్రటరీ రమేష్, విద్యా కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు జయవేలు వినతి పత్రాలు సమర్పించారు.

గృహ రుణాలు సహకార బ్యాంక్‌కు మార్చుకొనే సదుపాయం

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇతర బ్యాంకుల్లో పొందిన గృహ రుణాలు సహకార బ్యాంక్‌కు మార్చుకొనే సదుపాయం కల్పించారు. రాష్ట్ర సహకార శాఖ పరిధిలో సహకార బ్యాంక్‌లు పనిచేస్తున్నాయి. వీటిలో పంట, నగలు సహా పలురకాల రుణాలు అందిస్తున్నారు. అలాగే, గృహ రుణాల విభాగంలో 8.50-9 శాతం వడ్డీకి రూ.75 లక్షల వరకు రుణాలిస్తున్నారు. ప్రస్తుతం జాతీయ బ్యాంక్, ప్రైవేటు బ్యాంక్‌లు తదితరాల్లో గృహ రుణాలు తీసుకున్న వారు, దానిని సహకార బ్యాంక్‌లకు మార్చుకొనే సదుపాయం కల్పించారు. ఈ విషయమై సహకార శాఖ అధికారి మాట్లాడుతూ... పలు బ్యాంక్‌ల్లో గృహ రుణాలు తీసుకొనే సమయంలో అసలు, వడ్డీ చేర్చి ఈఎంఐ వాయిదాలు వసూలుచేస్తున్నారన్నారు. అదే సమయంలో సహకార బ్యాంకుల్లో ఈఎంఐ విధానానికి బదులు, చెల్లించాల్సిన దానికి వడ్డీ తగ్గించనున్నట్లు తెలిపారు.

వరద బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం


డ్రోన్ ద్వారా ఆహారం అందజేస్తున్న దృశ్యం

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద ముంపునకు గురై, దీవాకి గ్రామంలో ఆహారం లేక అల్లాడుతున్న బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం అందజేశారు. తెన్‌పొన్నై నదిలో ఏర్పడిన వరదల కారణంగా, విల్లుపురం జిల్లా తిరువెన్నయనల్లూర్ సమీపం మారింగియార్ గ్రామం ప్రత్యేక దీవిగా మారింది. చుట్టూ నీరు చేరడంతో అధికారులు ఆ గ్రామ ప్రజలకు సరకులు, ఆహారం అందజేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో, మూడు రోజులుగా ఆ గ్రామ ప్రజలు ఆహారం లేక అల్లాడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ దీపక్ శివ ఉత్తర్వులతో పోలీసులు, డ్రోన్ ద్వారా పాల ప్యాకెట్లు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలు అందజేశారు.

పరోటా తిని కబడ్డీ క్రీడాకారుడి మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నిలకోట రామరాజపురానికి చెందిన దీపక్ పాండి (28) అనే కబడ్డీ క్రీడాకారుడు పరోటా తిని మృతి చెందాడు. బుధవారం రాత్రి ఓ హోటల్ నుంచి పరోటా పార్శిల్ ఇంటికి తీసుకెళ్ళి కుటుంబ సభ్యులతో పాటు తిన్నాడు. కాసేపటికి దీపక్ పాండి ఛాతీలో నొప్పులు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం మదురై రాజాజీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆ మేరకు దీపక్‌పాండిని మదురై ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స ఫలించక అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పుత్తూరు-అత్తిపట్టు హార్బర్‌కు కొత్త రైల్వే లైన్

● 189 హెక్టార్ల భూసేకరణకు అనుమతి

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతిచ్చింది. 88 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రైల్వే లైనుకు 189 హెక్టార్ల భూములను సేకరించాల్సి వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామలై, 36కిలోమీటర్ల మొరంపూర్-ధర్మపురి,41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోట్టై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోట్టై లైన్ల భూసేకరణకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల వత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు. ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు,నాగలాపురం మండలాల మీదుగా అత్తిపట్టుకు చేరుతుంది. ఈ కొత్త రైలు మార్గం రూపుదాల్చితే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

టీచర్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు

● నిరసనగా విద్యార్థుల ఆందోళన


టీచర్‌కు మద్దతుగా ఆందోళన జరుపుతున్న విద్యార్థినులు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టి తాలూకా విక్రమంగళం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మూర్తి అనే టీచర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ప్లస్-1 విద్యార్థిని జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు ఆ స్కూలులో చదువుతున్న విద్యార్థుల్లో కలకలం రేపింది. ఆ విద్యార్థిని టీచర్‌పై తప్పుడు ఫిర్యాదు చేసిందంటూ పాఠశాలలోని విద్యార్థినులంతా గురువారం తరగతులు బహిష్కరించి ధర్నాకు దిగారు. టీచర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. అధ్యాపకులు జోక్యం చేసుకుని అర్ధవార్షిక పరీక్షలు జరుగుతుండటంతో ఆందోళన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆ మేరకు విద్యార్థినులు ఆందోళన విరమించారు. ఈ విషయమై కొందరు విద్యార్థినులు మాట్లాడుతూ టీచర్ మూర్తి దగ్గర చదివి, ప్రస్తుతం ఆ పాఠశాలలోనే పనిచేస్తున్న మరొక టీచర్ ఆయనపై కక్ష పెంచుకుని కొంతమంది విద్యార్థినులను ఉసిగొల్పారని తెలిపారు. విద్యార్థులు టీచర్ మూర్తి వద్దే ట్యూషన్లకు వెళ్తూ తన దగ్గరకు ఎవరూ ట్యూషన్‌క రావటం లేదన్న కక్షతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సంఘటనకు సంబంధించి టీచర్ మూర్తిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ విజయకుమార్ మాట్లాడుతూ ఇరువైపులా సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే టీచర్ మూర్తిపై చర్యలు తీసుకొంటామని చెప్పారు.

ముమ్మరంగా సాగు పనులు


దుక్కి దున్నతున్న రైతు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో చెరువులు, వాగులు నీటిమట్టాలు వినియోగించి రైతులు వరిసాగు చేస్తుంటారు. ఈశాన్య రుతుపవనాల వర్షాలతో చెరువుల్లో జలకళ సంతరించుకోగా, భూగర్భ జలమట్టాలు కూడా పెరగడంతో పంటలకు నీటి కొరత తీరింది. దీంతో, కాంచీపురం వేగవతి నదితీర ప్రాంతాలైన కిళంబి, మూసరవాక్కం, కీళకదిర్‌పూర్, మేల్ కదిర్‌పూర్ తదితర గ్రామాల రైతులు బుధవారం నుంచి సాగు పనులు చేపట్టారు. దుక్కి దున్నడం, నార్లు పోయడం తదితర పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఏటీటీ 36, ఏటీటీ 39, కో 43, ఏఎస్‌టీ 16, ఐఆర్ 64 రకాల వరి సాగును రైతులు అధికంగా చేపట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

మూడు చెక్‌డ్యాంలకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మించనున్న మూడు చెక్‌డ్యాంకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ గురువారం శంకుస్థాపన చేశారు. గుడియాత్తం డివిజన్ తాయపాక్కం-సున్నాంబుపేట మధ్య రూ.8.41 కోట్లతో కౌండన్య నదిపై వంతెన నిర్మాణం, తిరుపత్తూర్ జిల్లా అంబూరు డివిజన్ కదవానం-కానారు మధ్య రూ.6 కోట్లతో చెక్ డ్యాం, వెల్లకల్ సమీపంలో కానారుపై రూ.4 కోట్లతో చేపట్టనున్న చెక్‌డ్యాం నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, తిరుపత్తూర్ జిల్లా కలెక్టర్ దర్పగరాజ్, ఎమ్మెల్యేలు నందకుమార్, దేవరాజి, అమ్ములు విజయన్, విల్వనాథన్, గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందరరాజన్, డీఈ రమేష్ సహా పలువురు పాల్గొన్నారు.

ఇంటింటా నష్టాలను లెక్కగట్టాలి

● పుదువైలో బాధితుల రాస్తారోకో


పుదుచ్చేరి రాజా సిగ్నల్ వద్ద ధర్నా చేస్తున్న వర్షబాధితులు - రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న ఉరుళయన్‌పేట ఎమ్మెల్యే నెహ్రూ

పుదుచ్చేరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఫెంగల్ ప్రభావిత కుండపోత వర్షాల వల్ల జరిగిన ఆస్తినష్టం వివరాలను ప్రతి ఇంటి నుంచి అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉరుళయన్‌పేట ఎమ్మెల్యే నెహ్రూ నాయకత్వంలో గురువారం రాస్తారోకో జరిపారు. రాజా సిగ్నల్ ప్రాంతం వద్ద వరదలు, వర్షాలకు తడిసిన సామగ్రిని రోడ్డుపై ఉంచి స్థానికులంతా ధర్నా చేశారు. ఈ ఆందోళన కారణంగా గంటల తరబడి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఆ ప్రాంతానికి వెళ్ళి ఎమ్మెల్యే నెహ్రూతో చర్చలు జరిపారు. ఫెంగల్ తుఫాను వర్షబాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, ముఖ్యమంత్రి రంగసామి ప్రకటించిన రూ.5 వేలు ఏమాత్రం సరిపోదని చెప్పారు. ఆ సందర్భంగా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎమ్మెల్యే నెహ్రూ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ సంఘటన కారణంగా సుమారు రెండు గంటల పాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

హిందువులపై దాడులు నిరసిస్తూ ఆందోళన


ఆందోళనలో కార్యకర్తలు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా ఆడిటోరియం సమీపంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ఆందోళన జరిగింది. హిందూ మున్నని కోట అధ్యక్షుడు మహేష్ ఆందోళనను ప్రారంభించారు. ఆందోళనలో ఆర్గనైజర్ భువన్ రాజ్, బీజేపీ రాష్ట్ర ఆర్గనైజర్ దశరథన్, జిల్లా సెక్రటరీ బాబు, మహిళలు సహా వంద మంది పాల్గొన్నారు. ఆందోళన సందర్భంగా చేపట్టిన ర్యాలీని కొత్త బస్టాండ్ సమీపంలో పోలీసులు అడ్డుకొని, ఆందోళనకారులను చిత్ర మహల్‌కు తరలించారు.

సెంట్రల్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

టి.నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ ఐదో ప్లాట్‌ఫామ్ వద్దనున్న ఛార్జర్ పాయింట్ పేలడంతో మంటలు చెలరేగాయి. ప్రయాణికుల కోసం ఆ స్టేషన్‌లో ప్రతి ప్లాట్‌ఫామ్‌లోను ఛార్జర్ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఐదో నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద ఛార్జర్ పాయింట్ ఉన్నట్టుండి పేలి మంటలు చెలరేగాయి. రైల్వే భద్రతా దళం వెంటనే మంటలను ఆర్పివేయడంతో పెనుముప్పు తప్పింది.

14 మంది జాలర్ల అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా, సముద్రంలో చేపల వేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. రామేశ్వం నుంచి రెండు పడవల్లో 14 మంది జాలర్లు మంగళవారం చేపల వేటకు వెళ్లారు. నెడుదీవు సమీపంలో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ పడవల సహా జాలర్లను అదుపులోకి తీసుకొని నావికాదళం కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం తీరానికి చేరుకున్న జాలర్లు, ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులకు తెలియజేశారు. కాగా, ఇప్పటి వరకు శ్రీలంక జైళ్లలో 141 మంది రాష్ట్ర జాలర్లు బందీలుగా ఉన్నారని, వారిని విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు, బాధిత జాలర్ల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లిఫ్ట్‌లో చిక్కిన 11 మందిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలోని ఓ కల్యాణ మండపం లిఫ్ట్‌లో చిక్కుకున్న 11 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. ఈ కల్యాణ మండపంలో గురువారం ఉదయం ఓ శుభకార్యం జరిగింది. అందులో పాల్గొన్న ఏడుగురు మహిళలు, నలుగురు పురుషులు మొత్తం 11 మంది పై అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్లారు. బరువు అధికం కావడంతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. సుమారు 15 నిమిషాలు లిఫ్ట్ ఆగిపోవడంతో అందులోని వారు కేకలు పెట్టారు. సమాచారం అందుకున్న మాధవరం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని వారిని సురక్షితంగా బయటకు తీశారు. వారిలో ఇద్దరు మహిళలు స్పృహతప్పి పోవడంతో వారిని సమీపంలోని ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

● స్కూలు ప్రిన్సిపాల్ సస్పెన్షన్


టి.నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడయార్‌లోని ఐఐటీ మద్రాసు ప్రాంగణంలో ఉన్న వనవాణి మెట్రిక్యులేషన్ స్కూలులో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినందుకు ఆ స్కూలు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. ఆ పాఠశాలలో కొద్ది రోజుల క్రితం స్మార్ట్ వాచ్‌ల ద్వారా విద్యార్థులకు సహనశీల పరీక్షలు నిర్వహించారు. ఈ విషయమై డ్రగ్ కంట్రోల్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు అందాయి. ఆ సంస్థ పాఠశాలకు సంజాయిషీ నోటీసులిచ్చి పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిని విచారణకు రావాలని నోటీసులు పంపింది. ఈ నేపథ్యంలో ఆ స్కూలు ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ

● వ్యక్తి అరెస్ట్

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ద్విచక్ర వాహనాలను చోరీచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ చోరీలకు సంబంధించి కాట్పాడి డీఎస్పీ పళని ఉత్తర్వులతో కాట్పాడి సీఐ మణికంఠన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం వాహన తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అటు వైపు వచ్చిన వ్యక్తిని ఆపి విచారించగా, అతను పొంతన లేని సమాధానాలివ్వడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అతను రాణిపేట జిల్లా వాలాజా రామాపురం ప్రాంతానికి చెందిన భూపాలన్ కొడుకు శక్తివేల్ (31)అని, ద్విచక్రవాహనాలు చోరీచేస్తుంటాడని తెలిసింది. అతడిచ్చిన సమాచారంతో మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతనిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

శ్మశానంలో ఆరు శవాలు మాయం!?


శ్మశాన వాటికలో గ్రామస్తుల నిరసన

ప్యారీస్, డిసెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో ఖననం చేసిన ఆరు మృత దేహాలు మాయమయ్యాయని ఆరోపిస్తూ గ్రామస్తులు నిరసన తెలిపిన వ్యవహారం దిండుగల్ జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటన వేడచందూర్ సమీపంలోని శ్రీరామ్‌పురం పంచాయితీ పరిధిలోని పూతంపట్టి ఆదిద్రావిడ కాలనీలో చోటు చేసుకుంది. సుమారుగా అరవైకి పైగా కుటుంబాలు ఈ గ్రామంలో ఉంటున్నాయి. వీరికి పంచాయితీ ప్రత్యేకంగా శ్మశాన వాటికను కేటాయించింది. ఇటీవల అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అస్వస్థత కారణంగా మరణించడంతో అతని మృత దేహాన్ని ఖననం చేయడానికి గొయ్యి తవ్వేందుకు గ్రామస్తులు శ్మశానానికి వెళ్లగా ఆ ప్రాంతంలో సుమారు పదడుగుల లోతున తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అలాగే ఇంతకుముందు అక్కడ ఖననం చేసిన ఆరు శవాలు కనిపించకపోవడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. రాత్రి వేళలో శ్మశాన వాటికకు వెళ్లిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మట్టితో పాటు, ఆరు సమాధులు కూడా తవ్వితీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు శ్మశాన వాటికలో మట్టి తవ్వకాలు జరపడం, మృతదేహాలను తవ్వితీసుకెళ్లడాన్ని ఖండిస్తూ.. ఈ పని చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వేడచందూర్ మెయిన్ రోడ్‌లో గురువారం ఉదయం ఆందోళనకు దిగారు. సుమారు గంటకు పైగా వేడచెందూర్ - ఎరిఏడు రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. గ్రామస్తుల ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించుకున్నారు. కాగా రాజకీయ నేతల అండదండలు లేకుండా శ్మశానాల్లో మట్టి తవ్వకాలు జరపడానికి ఎవరూ కూడా ముందుకు రారని, తవ్వకాల పేరుతో ఆరు శవాలను మాయం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సంబంధితులపై కఠిన చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే, పీఎంకే, డీఎండీకే తదితర పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

సింగపూర్‌కు బేకరీ ఉత్పత్తుల ఎగుమతి

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ దేశానికి తొలిసారిగా చెన్నై నుంచి బేకరీ ఉత్పత్తులు నౌక ద్వారా ఎగుమతి చేశారు. కేక్ పాయింట్ అనే సంస్థ తయారుచేసిన ఈ ఉత్పత్తులు సింగపూర్‌లోని తమ శాఖ షోరూమ్‌ల్లో విక్రయించనున్నారు. ఈ విషయమై సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా బేకరీ ఉత్పత్తుల ఎగుమతులు తక్కువగా ఉంటాయని, ఆయా దేశాలు తమ అవసరాలకు అనుగుణంగా బేకరీ ఉత్పత్తులు తయారుచేసుకుంటాయని తెలిపారు. ఫ్రాన్స్‌కు చెందిన కొన్ని సంస్థలు మాత్రం బేకరీ ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాయని, తమ సంస్థ తొలిసారిగా సింగపూర్ దేశానికి నౌక ద్వారా 8-10 టన్నుల బేకరీ ఉత్పత్తులు ఎగుమతి చేసినట్లు ఆయన తెలిపారు.



'వణంగాన్'లో అరుణ్ విజయ్

జనవరి 10న 'వణంగాన్' విడుదల

బాలా దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వణంగాన్' వచ్చే నెల 10వ తేదీ సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని నిజానికి గత నెలలోనే విడుదల చేయాలని తొలుత భావించారు. కానీ, అనివార్య కారణాలతో రిలీజ్ చేయలేదు. ఈ నేపథ్యంలో జనవరి 10వ తేదీ విడుదల చేయనున్నట్టు తాజాగా ప్రకటించారు. ఇందులో అరుణ్ విజయ్ సరసన రోషిణి ప్రకాష్ హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రల్లో సముద్రఖని సహా అనేక మంది ప్రధాన తారాగణం పోషించారు. మరోవైపు, సంక్రాంతికి అగ్రహీరో అజిత్ 'విడాముయర్చి' విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే, మరికొన్ని చిత్రాలు కూడా పొంగల్ రేస్‌లో ఉండటం గమనార్హం. కాగా, ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి 'వి హౌస్' పతాకంపై నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం ట్రైలర్ విడుదలకాగా, నెటిజన్ల నుంచి మంచి స్పందన వచ్చింది.

'బిగ్ షార్ట్స్ సీజన్-3' విజేతల వెల్లడి

సినిమా ఔత్సాహికులను ఒక వేదిక పైకి తీసుకొచ్చే డిజిటల్ ప్లాట్‌ఫాం మూవీబఫ్, టర్మరిక్ మీడియా సంయుక్తంగా 'బిగ్ షార్ట్స్ సీజన్-3' పేరుతో ఒక షార్ట్‌ఫిల్మ్ కంటెస్ట్ నిర్వహించి, విజేతలను తాజాగా వెల్లడించాయి. ఇందులో భాగంగా ఈ యేడాది కరుప్పయ్య 'బీ లైక్ కుట్టియప్ప' అనే షార్ట్‌ఫిల్మ్‌ను ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.5 లక్షలు ప్రదానం చేశారు. అలాగే, టర్మరిక్ మీడియాతో కలిసి స్టోరీ డిస్కషన్ లేదా శిక్షణలో పాలుపంచుకునే అవకాశాన్ని కూడా కల్పించారు. తొలి రన్నరప్‌గా విగ్నేష్ వడివేల్ 'అన్బుడన్' షార్ట్‌ఫిల్మ్‌కు, రెండో రన్నరప్‌గా పవన్ అలెక్స్ 'రెండు', మూడో రన్నప్‌గా బాల భారతి 'కడవులే', నాలుగో రన్నరప్‌గా బాలాజీ నాగరాజన్ 'ది స్పెల్' అనే లఘు చిత్రాలను అందజేశారు. వీటిలో మొదటి, రెండో రన్నరప్‌లకు రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, మూడు, నాలుగు రన్నరప్‌లకు రూ.30 వేల చొప్పున నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ యేడాది తయారైన ఈ షార్ట్‌ఫిల్మ్‌లను రాష్ట్రంలోని 300 థియేటర్లలో ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. 'బీ లైక్ కుట్టియప్ప' షార్ట్ ఫిల్మ్... ఒక గిరిజన యువకుడు తన సొంతూరుకి హెలికాప్టర్ తీసుకొచ్చే స్టోరీ. అలాగే, మిగిలిన నాలుగు షార్ట్ ఫిల్మ్ సామాజిక, సందేశాత్మక కాన్సెప్టులతో రూపొందించారని టర్మరిక్ మీడియా ప్రధాన సీఈవో ఆర్. మహేంద్రన్ వెల్లడించారు. చిత్రపరిశ్రమలో తమ ప్రతిభతో రాణించాలనుకునే ఔత్సాహికులకు మూవీబఫ్, టర్మరిక్, బిగ్ షార్ట్స్ ఒక మంచి వేదిక అని, దీన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ విజేతల ప్రకటన, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో దర్శక హీరో ప్రదీప్ రంగనాథన్ సహా అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



'బిగ్ షార్ట్స్ సీజన్-3' ప్రారంభంలో ప్రదీప్ రంగనాథన్, నిర్వాహకులు

బ్రేకప్... బెస్ట్ మూవ్‌మెంట్

● ఐశ్వర్య లక్ష్మి



ఒక మహిళ జీవితంలో విడాకులు లేదా బ్రేకప్ అనేది ఒక బెస్ట్ మూవ్‌మెంట్ అని యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి అభిప్రాయపడుతున్నారు. 'గట్టాకుస్తి', 'పొన్నియిన్ సెల్వన్' వంటి హిట్ చిత్రాల్లో నటించిన ఈ మలయాళ భామ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విడాకులు, బ్రేకప్‌పై ఆసక్తికర, ఆశ్చర్యకర వ్యాఖ్యలు చేశారు. 'ఒక మహిళ జీవితంలో విడాకులు లేదా బ్రేక్ అనేది బెస్ట్ మూవ్‌మెంట్‌గా చూడాలి. వ్యక్తిగత పురోభివృద్ధి కోసమే ఇలాంటి నిర్ణయాలకు వెళుతుంటారు. వ్యక్తిగత ఎదుగుదలకు ఇది ప్రారంభంగా భావించాలి. పాతతరం ప్రేమికులు వివాహానికి ముందు శృంగారంలో పాల్గొంటే వారు వెంటనే పెళ్ళి చేసుకునేవారు. కానీ, నేటితరం ఆలోచనా తీరు పూర్తిగా మారిపోయింది. ఎవరూ ఆ విషయంలో మాటపై నిలబడటం లేదు. ఒకవేళ ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకుంటే వివాహితులైనప్పటికీ దానినుంచి బయటపడి జీవితంలో పైకి వచ్చేందుకు దృష్టిసారించాలి' అని సూచించారు. కాగా, ఐశ్వర్య లక్ష్మి చేసిన ఈ కామెంట్స్‌ను పలువురు స్వాగతిస్తుంటే మెజార్టీ వర్గం మాత్రం విమర్శలు గుప్పిస్తుంది.

మెగాఫోన్ పట్టనున్న సంతానం!



ఒకవైపు కమెడియన్‌గా మరోవైపు హీరోగా రాణిస్తున్న సంతానం ఇపుడు మెగాఫోన్ పట్టనున్నారు. త్వరలోనే ఈయన ఓ చిత్రానికి దర్శకత్వం వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. విజయ్ టీవీ ద్వారా లైమ్‌లైట్‌లోకి వచ్చిన సంతానం... ఆ తర్వాత అనేక చిత్రాల్లో కమెడియన్‌గా నటించి తనకంటూ ఫ్యాన్ ఫాలోయింగ్, గుర్తింపు తెచ్చుకున్నారు. హాస్య నటుడిగా ఫాలోయింగ్ సంపాదించుకున్న తర్వాత ఆయన హీరోగా నటించారు. వీటిలో ఒకటి రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తాపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన తొలిసారి దర్శకత్వం వహించాలని భావిస్తున్నారు. ఈ మూవీలో హీరోగా నటిస్తూ ఆయనే దర్శకత్వం వహించాలన్న సంకల్పంతో ఉన్నారు. ఈ ప్రాజెక్టు తర్వాత 'యామిరుక్క భయమేల్' దర్శకుడు డీకే డైరెక్షన్‌లో నటించనున్నారు. కాగా, తాను దర్శకత్వం వహించే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

చిత్రజ్యోతి



ద్రావిడ కళగం అధ్యక్షుడు వీరమణి 92వ జన్మదినం సందర్భంగా చెన్నైలోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఐటీ యూనివర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

తిరుప్పరంకుండ్రంలో కార్తీక దీపోత్సవాలు ప్రారంభం



కంబత్తడి మండపంలో ధ్వజారోహణం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ప్రథమ క్షేత్రమైన తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో కార్తీక మహాదీపోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవర్ల సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి, దైవానై అమ్మవారికి పంచామృతం, 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేక అలంకరణలతో కంబత్తడి మండపంలో స్వామి, అమ్మవారు కొలువుదీరారు. ఆలయ ప్రధానార్చకులు, శైవపండితుల మంత్రోచ్చారణ నడుమ ధ్వజారోహణం చేశారు. ఆలయ అర్చకులు ధ్వజస్తంభానికి హారతులిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ దైవానై సమేతంగా స్వామివారు స్వర్ణ సప్పరం, స్వర్ణమయూర వాహనం, రజతభూత వాహనం, హంసవాహనం తదితర వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన పట్టాభిషేక మహోత్సవం ఈ నెల 12న స్వామివారికి నిర్వహిస్తారు. 13 ఉదయం రథోత్సవం , సాయంత్రం ఆలయంలో బాల దీపం, కొండపై మహాదీపం వెలిగించనున్నారు.

వైభవంగా అష్టబంధన మహాకుంభాభిషేకం

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు శాసన సభ నియోజకవర్గం అనైకట్టు యూనియన్ కళనిపాక్కం నవ సాయిపురం ఆలయంలో అష్టబంధన సహిత మహా కుంభాభిషేకం జరిగింది. కార్యక్రమంలో డీఎంకే జిల్లా సెక్రటరీ, వేలూరు ఎమ్మెల్యే నందకుమార్, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం, ఆనైకట్టు యూనియన్ సెక్రటరీ కుమారపాండ్యన్, వెంకటేశన్, కేవీ కుప్పం యూనియన్ సెక్రటరీ మురుగేశన్, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని రాష్ట్ర ఐటీ శాఖామంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగ రాజన్ అన్నారు. నగరంలో గురువారం గ్లోబర్ సైబర్ సెక్యూరిటీ సమ్మిట్ ఎడిషన్ పేరుతో ఏపీఆర్ 2024 సదస్సు జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సదస్సుకు హాజరైన మంత్రి ప్రసంగిస్తూ.. ఇటీవలకాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడకుండా సాంకేతిక పరిజ్ఞానంలో సాధికారత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 'ది బ్యాటిల్ ఫర్ సైబర్ సుప్రమసీ' అనే థీమ్‌తో జరిగిన ఈ సమ్మిట్‌లో కేంద్ర నేషనల్ సైబర్ సెక్యూరిటీ మాజీ కో ఆర్డినేటర్, సైబర్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పంత్, రాష్ట్ర సమాచార సాంకేతిక, డిజిటల్ సేవల విభాగం తమిళనాడు విభాగం కార్యదర్శి, శ్రీకుమార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

మానవాళి శ్రేయస్సు కోసం పుడమిపై అవతరించిన యేసుక్రీస్తు బోధనలు, మహిమలను విశ్వవ్యాప్తం చేసేందుకు ఆయన శిష్యులు ప్రపంచం నలుమూలలకు వెళ్లారు. అపోస్తులు అనబడే 12 మంది శిష్యుల్లో ఒకరైన సెయింట్ తోమా కూడా 1516లో భారతదేశానికి వచ్చి పలు ప్రాంతాల్లో పర్యటించారు. చివరిగా ఆయన పరంగిమలై కొండపై శత్రువుల దాడిలో మరణించి చరిత్రలో నిలిచిపోయారు. తోమా నగరంలో పర్యటించిన ప్రాంతాల్లో శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన చర్చిలు నేడు చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచి దేశ, విదేశాల భక్తులను ఆకర్షిస్తున్నాయి. - ప్యారీస్, ఆంధ్రజ్యోతి

ఆధ్యాత్మికం



తోమా బండరాయిపై చేతితో చెక్కిన శిలువ



సెయింట్ తోమా చేతి వేలి ఎముక ముక్క



సైదాపేట లిటిల్ మౌంట్ చర్చిలో రాతి శిలువ



యేసుక్రీస్తు తల్లి మరియమ్మ నిండు గర్భంతో ఉన్నట్లు చెక్కిన విగ్రహం



శాంతోమ్ చర్చి

ఘనమైన చరితం..

● సెయింట్ థామస్ బాసిలిక నేపథ్యం

అరుదైన శిల్పకళా నైపుణ్యం

ఏసుక్రీస్తు 12 మంది శిష్యుల్లో ఒకరైన సెయింట్ తోమా గలిలియా ప్రాంతంలోని జాలరి కుటుంబంలో జన్మించారు. ఆయన క్రీస్తు బోధనలను భారతదేశంలో ప్రచారం చేసేందుకు అనేక ప్రాంతాల్లో పర్యటించారు. అలనాటి మద్రాసు ప్రిసీడియంలో పర్యటించిన ప్రాంతాల్లో ఆయన పేరుతో నిర్మించిన చర్చిల్లో ప్రస్తుతం ఆరాధన కార్యక్రమాలు జరుగుతున్నాయి. తోమా పర్యటన సమయంలో పడిన బాధలు, శత్రువుల బారిన పడకుండా తలదాచుకున్న గుహలు, బల్లెం పోటుకు గురైన ఆనవాళ్లు నేడు సజీవసాక్ష్యాలుగా చరిత్రలో నిలిచిపోయాయి. మైలాపూర్‌లోని శాంతోమ్, సైదాపేట జంక్షన్‌లోని లిటిల్ మౌంట్, అప్పటి పరంగిమలై అని పిలవబడిన ఇప్పటి సెయింట్ థామస్ మౌంట్‌లో ఎన్నెన్నో అద్భుతాలు జరిగినట్లు ఆధారాలున్నాయి.



సెయింట్ థామస్ మౌంట్ చర్చి ప్రాంగణంలో శిలువపై యేసుక్రీస్తు

సెయింట్ తోమా...

ఏసుక్రీస్తును శిలువ వేసిన అనంతరం తిరిగి మూడో రోజు పునరుత్థానం చెందిన జెరుషలేములో ముందుగా తన శిష్యులకు దర్శనమిచ్చినట్లు బైబిల్ చెబుతోంది. ఏసుక్రీస్తు సజీవుడిగా తిరిగి రావడంపై అనుమానించిన తోమా, ఆయన్ని శత్రువులు బల్లెంతో పొడిచిన డొక్కలో చేయి పెట్టి రంధ్రం ఉండడం చూసి పశ్చాత్తాపం చెందారు. అప్పటి నుంచి ఆయన మహిమలు ప్రజలకు తెలియజేయడానికి తోమా సముద్ర మార్గంలో భారతదేశంలోని కేరళ రాష్ట్రంలో అడుగుపెట్టారు. ఏడేళ్లలో అక్కడ ఆరు ప్రార్థనా మందిరాలు నిర్మించి కన్నియాకుమారి సమీపంలోని చిన్నముట్టం తీరానికి చేరుకున్నారు. అలా పలు ప్రాంతాల మీదుగా పర్యటించిన తోమా చెన్నపట్నంలోకి ప్రవేశించారు.

లిటిల్ మౌంట్ ఇంకిపోని నీటి ఊట...

క్రైస్తవం మతం కాదు... ప్రజల జీవన మార్గమని తోమా చేసిన ప్రచారాన్ని ప్రజలు ఆదరించారు. అయితే, తోమాను ద్వేషించిన కొందరు ఆయన్ని హతమార్చే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న తోమా సైదాపేట ప్రాంతం అడయార్ నది కాలువ ఒడ్డున ఉన్న కొండపైకి చేరుకొని తలదాచుకున్నారు. కొండ గుహలో దాహం తీర్చుకొనేందుకు బండరాళ్ల మధ్య చేతితో తీసిన నీటి ఊట నేటికి ఇంకిపోలేదు. దీనిపై పరిశోధనలు చేపట్టిన శాస్త్రవేత్తలు, కొండపై ఆ నీటి ఊట ఎక్కడ నుంచి వస్తుందో తెలుసుకోలేక, ఇదో అద్భుతమని నిర్ధారించారు. ఒక రోజు ప్రార్థనలో గడిపిన తోమా, తనపై శత్రువులు దాడికి వస్తున్నారని తెలుసుకొని తప్పించుకొనే ప్రయత్నం చేశారు. అప్పుడు గుహ రంధ్రం కింద గోడపై ఆయన చేతిముద్రలు, దిగువ బండ రాతికి పాద ముద్రలు పడ్డాయి. ఈ గుర్తులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా సందర్శకులను, శాస్త్రవేత్తలను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి.

పరంగిమలై...

1516వ సంవత్సరం ఎలాంటి రవాణా వసతులు అందుబాటులో లేని అప్పటి మద్రాసు ప్రిసీడియంలో మైలాపూర్ ప్రాంతంలో ప్రచారం చేపట్టిన తోమా కాలినడకన శాంథోమ్ సముద్రతీరానికి చేరుకున్నారు. అక్కడ మత్స్యకారుల మధ్య కొన్నాళ్లు ప్రచారం చేశారు. పరంగిమలై కొండపై మరణించిన ఆయన మృతదేహాన్ని శాంతోమ్ ఆలయ ప్రాంగణంలో ఖననం చేసినట్లు చరిత్ర చెబుతోంది. తోమా సముద్రమట్టానికి 300 అడుగుల ఎత్తున్న కొండపై తలదాచుకొనేందుకు పరంగిమలై ప్రాంతానికి చేరుకున్నారు. ఆ కొండపై కూడా తన కోసం నీటి ఊట, ప్రార్థించేందుకు రాతి శిలువ చేతితో మలిచారు. ఒకరోజు రాత్రి గుహలో ప్రార్థనలో ఉన్న తోమాను శత్రువులు మూకుమ్మడిగా బల్లెంతో పొడవడంతో ఆయన తనువు చాలించారు. తోమా తన వెంట తీసుకొచ్చిన వస్తువులు, మేరిమాత తైలవర్ణ చిత్రాలను సెయింట్ థామస్ మౌంట్ కొండపై ఆయన పేరుతో నిర్మించిన చర్చిలో భద్రపరిచారు.

రాతి శిలువ నుంచి కారిన రక్తం...

సెయింట్ తోమా తన చేతులతో మలచిన రాతి శిలువ నుంచి 1558 డిసెంబరు 18వ తేది కారిన రక్తం మూడేళ్ల వరకు వచ్చినట్లు చరిత్ర స్పష్టంగా చెబుతోంది. ఏసుక్రీస్తు శిష్యుల్లో ఒకరైన సెయింట్ లూకా చేతితో గీసిన మదర్ మేరి-బాలయేసే తైలవర్ణ చిత్రాన్ని తన వెంట తెచ్చిన తోమా ఈ ఆలయంలో భద్రపరిచారు. ఈ చిత్రం కూడా ఇప్పటివరకు చెక్కుచెదరకపోవడం అద్భుతంగా భావిస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచంలో మరెక్కడ కనిపించని యేసుక్రీస్తు తల్లి మరియమ్మ నిండు గర్భంతో ఉన్న రాతి విగ్రహం ఈ బాసిలికలో ఉండడం విశేషం.



సెయింట్ థామస్ చర్చి

బాసిలికగా గుర్తింపు...

క్యాథలిక్‌ల ప్రధాన కేంద్రమైన రోమ్‌లోని వాటికన్ నగరానికి చెందిన ప్రధాన మతగురువు రెండవ పోప్ జాన్‌పాల్ భారతదేశ పర్యటనకు వచ్చి పరంగిమలైలో సెయింట్ తోమా మరణించిన ప్రాంతాన్ని సందర్శించారు. ఆలయంలో తోమాకు సంబంధించి భద్రపరచిన గుర్తులు, ఆధారాలు పరిశీలించారు. 2011 జనవరి 8వ తేది 118 మంది బిషప్‌లు, 200 మంది ఫాదర్లు, 3వేల మంది భక్తుల సమక్షంలో సెయింట్ థామస్ మౌంట్ చర్చిని బాసిలికగా ప్రకటించారు. భారత ప్రభుత్వం కూడా దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రకటించడం గమనార్హం. కాగా, ప్రతి ఏటా డిసెంబరు 18న సెయింట్ తోమా రాతితో చెక్కిన శిలువ వద్ద ఉత్సవాలు జరుపుకుంటారు. అలాగే, సైదాపేట లిటిల్ మౌంట్, శాంథోమ్ చర్చిల్లో కూడా క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోనున్నారు.



సెయింట్ లూకా గీసిన బాలయేసుతో మేరిమాత తైలవర్ణ చిత్రం - సెయింట్ తోమా ప్రాణాలు విడిచిన ప్రాంతంలో ఆయన తైలవర్ణ చిత్రం



మైలాపూర్ శాంథోమ్ చర్చిలో మరణించిన సెయింట్ తోమా రూపంలో శిల్పం



లిటిల్ మౌంట్‌లో సెయింట్ తోమా ప్రార్థించిన గుహ



బండరాతిపై నమోదైన తోమా పాదముద్ర





రథమెక్కి... భక్తులను కటాక్షించి..!



● వైభవంగా అమ్మవారి రథోత్సవం







బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటలకు పల్లకీ ఉత్సవం
- 10 గంటలకు పంచమి తీర్థం మండపంలో చక్రత్తాళ్వారు, ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం
- మధ్యాహ్నం 12.15 గంటలకు పద్మసరోవరంలో చక్రస్నానం
- రాత్రి 7.30 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం
- 9.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ముత్యపు కవచపు అలంకారంలో అమ్మవారు సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా రథంపై కొలువుదీరారు. ఉదయం 8 గంటలకు ధనుర్లగ్నంలో ప్రారంభమైన రథోత్సవం 10.15 గంటల వరకు మాడవీధుల్లో సాగింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ రథాన్ని లాగారు. రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రథం మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ జరిగాయి. రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై కల్కిరూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, సుందరరత్నం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇక, గురువారం రాత్రితో వాహనసేవలు ముగిశాయి. ఈ ఎనిమిది రోజులు.. 16 వాహనాలపై అమ్మవారు వివిధ రూపాల్లో ఊరేగారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రిన్స్ జ్యూవెలరీ సన్మానం



పోప్‌కు వెండి జ్ఞాపిక అందజేస్తున్న జ్యూవెలరీ నిర్వాహకులు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాటికన్ సిటీలో జరిగిన సర్వమత సదస్సు శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోప్ ఫ్రాన్సిస్‌ను ప్రిన్స్ జ్యూవెలరీ ప్రత్యేకంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రిన్స్ జ్యూవెలరీ ఛైర్మన్ ప్రిన్సెస్ జోన్, ప్రిన్స్ జ్యూవెలరీ డైరెక్టర్ షీబా ప్రిన్స్ వెండి జ్ఞాపికను ఫ్రాన్సిస్‌కు బహూకరించారు. వాటికన్ సిటీలో వందేళ్ళను పూర్తి చేసుకున్న సందర్భంగా ఈకార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి అరుదైన కార్యక్రకమంలో పాల్గొనడం విభిన్న వర్గాల ప్రజల మధ్య విశ్వాసాలు, మత సామరస్యం, సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడంలో తమ సంస్థ నిబద్ధతకు ప్రతీకగా భావిస్తున్నట్టు ప్రిన్సెస్ జోన్ పేర్కొన్నారు. అలాగే, ఇలాంటి అరుదైన చారిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొనడం, ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మందికి స్ఫూర్తినిచ్చే నాయకత్వం వహిస్తున్న పోప్ పవిత్రతకు ఈ జ్ఞాపిక అందజేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉదయనిధికి కొత్త పదవి

టీనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రణాళికా సంఘం ఎక్స్ అఫిషియో వైస్‌ఛైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి నియమితులయ్యారు. ఈ సంఘానికి ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఉదయనిధి రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి మంత్రిత్వ శాఖ కూడా నిర్వర్తిస్తుండటంతో ఆయనను ప్రణాళికా సంఘం ఎక్స్‌అఫిషియో వైస్ ఛైర్మన్‌గా నియమించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.

సంక్రాంతి స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్‌కు డిమాండ్

ఐసీఎఫ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా సంస్థ నడిపే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇప్పటికే 30 వేలమంది రిజర్వేషన్ చేసుకున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులో 90 రోజులకు ముందే రిజర్వేషన్ చేసుకునే సదుపాయం ఉండటంతో నగరం నుంచి సంక్రాంతి పండుగ కోసం స్వస్థలాలకు వెళ్లే వారంతా టికెట్లు రిజర్వు చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. జనవరి 11, 12, 13 తేదీల్లో నడుపనున్న ఈ బస్సుల్లో ప్రయాణించడానికి సుమారు1.5 లక్షల మంది టికెట్లు రిజర్వు చేసుకునే అవకాశాలున్నాయని రవాణా సంస్థ అధికారులు తెలిపారు.



మైలాడుదురై జిల్లా తిరుక్కడయూరు అభిరామి సమేత అమృతఘటేశ్వరస్వామి ఆలయంలో కొత్తగా తయారైన వెండి రథాన్ని వివిధ ఆధీనాలతో కలిసి లాగుతున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు



కోవైలో అంతర్జాతీయ క్రీడా మైదానం ప్రాజెక్టుకు సంబంధించి చెన్నై క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

● కార్తీక దీపోత్సవాలు...

కనులపండువగా పంచమూర్తుల ఊరేగింపు



వెండి నంది వాహనంపై అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు - హంస వాహనంలో పరాశక్తి అమ్మవారు - మూషిక వాహనంలో గణపతి - నెమలి వాహనంలో మురుగన్, వల్లి, దేవయాని - నంది వాహనంలో చండికేశ్వరుడు



వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి మూషిక వాహనంలో వినాయకుడు, నెమలి వాహనంలో వల్లి, దేవయాని సమేత మురుగన్, వెండి అధికార నంది వాహనంలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు దంపతులకు సహాయంగా పరాశక్తి అమ్మవారు. వెండి హంస వాహనంలో చండికేశ్వరుడు, ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ, మేళతాళాలు, బాణసంచా నడుమ మాడవీధుల్లో విహరించారు. భక్తులతో తిరువణ్ణామలై సందడిగా మారింది.

ఇంకా జలదిగ్బంధంలోనే మీంజూరు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలు తగ్గి వారం రోజులు దాటినా తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని మీంజూరులో ఇంకా 200 ఇళ్లు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మీంజూరు టౌన్ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డు కలైంజర్‌నగర్ మొదటి వీధి, రెండో వీధి, రాజేశ్వరీనగర్, ప్రేమానంద స్కూలు వీధి తదితర వీధుల్లో సుమారు 200 ఇళ్లు చుట్టూ మోకాలి లోతున వర్షపునీరు, మురుగునీటితో కలిసి ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా ఈ నీటిని తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆ నీటి ద్వారా దుర్గంధం వస్తోందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఆ నీటిలో పాములు కూడా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



కలైంజర్‌నగర్‌లో - మీంజూరు వీధిలో ఇంటి దగ్గర నిలిచిన వర్షపునీరు

కేఎస్ రవికుమార్‌కు మాతృవియోగం



రుక్మిణి అమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు కేఎస్ రవికుమార్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి రుక్మిణి అమ్మాళ్ (88) వృద్ధాప్యం కారణంగా బుధవారం రాత్రి కన్నుమూసినట్టు కేఎస్ రవికుమార్ కుటుంబ సభ్యులు వెల్లడించారు. సైదాపేట శ్రీనగర్ కాలనీలో ఉన్న స్వగృహంలో ఆమె తుదిశ్వాస విడిచారు. గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, రుక్మిణి అమ్మాళ్ భౌతికకాయానికి పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

డాక్టర్ మురుగేశన్ పరిశోధనకు ఉత్తమ అవార్డు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన డాక్టర్ మురుగేశన్ పరిశోధనకు ఉత్తమ అవార్డు లభించింది. నికోటిన్ వ్యసనం నుంచి బయటపడే అంశంపై చేసిన విస్తృత పరిశోధనకు గౌహతిలో జరిగిన అంతర్జాతీయ సైన్స్ సమ్మిట్‌లో ఈ ప్రత్యేక అవార్డును డాక్టర్ మురుగేశన్‌కు ప్రదానం చేశారు. తగిన మోతాదులో విటమిన్ సి అందజేయడం వల్ల నికోటిన్ వ్యసనం నుంచి విముక్తులను చేయొచ్చని డాక్టర్ మురుగేశన్ తన పరిశోధన ద్వారా నిరూపించారు. ఈ పరిశోధన నికోటిన్ బాధితులను రక్షించవచ్చని ఆ వర్సిటీ పబ్లిక్ హెల్త్ విభాగాధిపతి, ప్రిన్సిపాల్ డాక్టర్ జెరాడు సురేష్ వెల్లడించారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

● ఉరిశిక్షను జీవితఖైదుగా తగ్గింపుపై హైకోర్టు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో ఉరిశిక్ష పడిన ఖైదీకి యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గిస్తూ రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. తిరునల్వేలిలో ఓ హత్యకేసులో అరెస్టయిన రాధాకృష్ణన్ అనే వ్యక్తికి తిరునల్వేలి జిల్లా కోర్టు ఉరిశిక్ష విధించింది. ఆ తీర్పును హైకోర్టు, సుప్రీం కోర్టు ఖరారు చేశాయి. ఆ తర్వాత రాధాకృష్ణన్ రాష్ట్రపతి క్షమాభిక్ష కోరారు. ఆ ప్రకారం రాధాకృష్ణన్‌కు విధించిన ఉరిశిక్షను జీవితపర్యంతం జైలులోనే గడిపేలా యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చారు. ఈ నేపథ్యంలో తనను ముందుగానే విడుదల చేయాలని కోరుతూ తాను గవర్నర్‌కు పంపిన పిటిషన్ పరిశీలించేలా ఉత్తర్వులివ్వాలని రాధాకృష్ణన్ హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఆ పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, ఎం.జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది ఆర్.మునియప్పరాజ్ హాజరై క్షమాభిక్ష పిటిషన్‌పై రాష్ట్రపతి పరిశీలించి ఇదివరకే ఉత్తర్వులివ్వడంతో (శిక్షను తగ్గించడంతో) ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని, అందువల్ల గవర్నర్‌కు పిటిషనర్ సమర్పించిన పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు. ఆ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంలో రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎలాంటి జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

విమానాశ్రయంలో నక్షత్ర తాబేళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్లు

ప్యారీస్, డిసెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): మలేసియా నుంచి విమానంలో అక్రమంగా తరలించిన 5400 నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు ఇద్దరిని అరెస్టు చేశారు. కౌలాలంపూర్ నుంచి ఓ ప్రైవేటు విమానం బుధవారం స్థానిక త్రిశూలం అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చింది. అందులో ప్రయాణికుల లగేజీని తనిఖీ చేసిన కస్టమ్స్ అధికారులు నగరానికి చెందిన ఆకాశ్ (29) మహ్మద్ రఫీ (28) లను అనుమానించి అదుపులోకి తీసుకుని, విచారణ జరపగా నక్షత్ర తాబేళ్లను చట్ట విరుద్ధంగా తరలించినట్లు తెలిసింది. దీనితో అట్ట పెట్టెలో ఉన్న సుమారు 5400 నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకుని, కస్టమ్స్ అధికారుల సూచనల మేరకు మళ్లీ తిరిగి మలేసియాకు పంపించారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

ప్యారీస్, డిసెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 8వ వర్ధంతిని పురస్కరించుకుని టీనగర్‌లో ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ నేతృత్వంలో జయలలిత చిత్రపటానికి గురువారం పూలు చల్లి నివాళులర్పించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ఆదేశాల మేరకు దక్షిణ చెన్నై, ఉత్తర, పశ్చిమ జిల్లా తరుపున టీనగర్ 136వ వార్డులోని ధనకోటి అమ్మల్ తోటలో డా. సునీల్ వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు. ఎస్.సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు ఎస్. సతీష్ కుమార్, సూర్య, రమేష్, జయరామన్, సూర్యకళ, తేన్‌మొళి, పద్మనాభన్, గార్డెన్ సురేష్ కుమార్, ఎస్.శేఖర్, పోస్టాఫీసు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



పళ్లిపట్టు, ఆర్కే పేటలో అన్నదానం చేస్తున్న అన్నాడీఎంకే శ్రేణులు

తిరువళ్లూరు జిల్లాలో..

తిరుత్తణి డిసెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పట్టణంలో జయలలిత ఎనిమిదో వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నాడీఎంకే పట్టణ కార్యదర్శి పి.జయవేలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాష్, మాజీ కౌన్సిలర్ కృపారెడ్డి, కమల్, ఆనందబాబు, ఢిల్లీబాబు, దినేష్, ధాము తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే పేటలో...

ఆర్‌కే పేటలో పార్టీ నాయకులు జయలలిత విగ్రహానికి పూలమాల వేసి 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎం.నరసింహన్ పాల్గొన్నారు.